# కర్మ

మానవుడు పుట్టినప్పటి నుంచి మరణించేంత వరకూ రోజూ ఎన్నో కర్మలు చేస్తూనే ఉంటాడు. కర్మలు చేస్తే దానికి తగ్గట్టు ఫలితం తప్పక వస్తుంది. మంచి చేస్తే మంచి, చెడు చేస్తే చెడు ఫలితం వస్తుంది. కర్మ చేసినప్పుడు దాని వలన ఏర్పడే కర్మ-ఫలాన్ని తప్పక అనుభవించాలి. ఇది కర్మ సిద్ధాంతం.

ఫలితాన్నిచ్చే సమయాన్ని బట్టి కర్మలను మూడు రకాలుగా విభజించవచ్చు. అవి 1) ఆగామి కర్మలు, 2) సంచిత కర్మలు 3) ప్రారబ్ధ కర్మలు. ఇప్పటి నుంచి భవిష్యత్తులో చేయబోయే కర్మలను ఆగామి కర్మలంటారు. ఈ ఆగామి కర్మలు చేయడం వలన మనం పాప-పుణ్యాలను సంపాదించు కుంటాం, అవి సంచిత కర్మలలోకి చేరుతూ ఉంటాయి. దీని వలన మనకు భవిష్యత్తు అనేది ఏర్పడుతుంది. కర్మ చేస్తూ కూడా ఆ కర్మఫలం అంటకుండా తప్పించుకోవడానికి ఉపాయం - అహం లేకుండా, పాప-పుణ్యాలను ఆశించకుండా, రాగ-ద్వేషాలకు అతీతంగా చేరి కర్మలను చేయాలి. ఇలా చేస్తే కర్మలకు ఫలితం తక్షణమే వస్తుంది. దీని వలన భవిష్యత్తనేది ఏర్పడదు. ఇది ఎలా చేయాలనే విషయం తెలుసుకోవడానికి రాగ-ద్వేషాలు అనే టాపిక్‌ని చదవండి.

గతం నుంచి ఇప్పటి వరకు చేసిన కర్మల వలన సంపాదించిన పాప-పుణ్యాలను సంచిత కర్మలని అంటారు. ప్రారబ్ధంలో వ్రాసిపెట్టుకుని వచ్చిన పాప-పుణ్యాలు పోను, ఇప్పటివరకు అనుభవించకుండా మిగిలి ఉన్న కర్మ ఫలితాలన్నీ సంచిత కర్మల క్రిందకు వస్తాయి. ఈ రోజుకి రేపు అనేది భవిష్యత్తు అవుతుంది. కాని ఎల్లుండికి రేపు అనేది గతం అవుతుంది. కనుక భవిష్యత్తనేది గతం అయిన వెంటనే, ఆగామి కర్మలన్నీ సంచిత కర్మలుగా మారి అందులో కలిసిపోతాయి. కనుక సంచిత కర్మలు పూర్తిగా తొలగాలంటే వాటిని జ్ఞానాగ్నిలో దగ్ధం చేయాలి.

జన్మ తీసుకునే ముందు వ్రాసుకుని వచ్చిన తలరాతను ప్రారబ్ధ కర్మ అని అంటారు. వీటిని మీరు ఈ ప్రస్తుత జన్మలోనే అనుభవిస్తారు. అంటే మీ ప్రస్తుత జన్మ అనేది ముందుగానే నిర్ణయింపబడిన దాని ప్రకారమే నడుస్తున్నదని గ్రహించండి. దీని వలననే కొందరికి ఎంత కష్టపడ్డా ఫలితాలు రావు, మరి కొందరికి సులభంగానే ఫలితాలు వస్తాయి, ఎందుకంటే ఫలితాలనేవి తలరాతలో ఉన్న ప్రకారమే లభిస్తాయి కాని కష్టం వలన రావు కనుక.

చాలా మంది దాన-ధర్మాలు, ఎన్నో మంచి పనులు మరియు సేవలు చేస్తూ, జీవితంలో అనుకున్నది జరుగుతుందని

ఆశిస్తారు. కాని వారికి అనుకున్నది జరగటం లేదు. దీనికి కారణం ఈ జీవితంలో జరగవలసినది ప్రారబ్ధం ద్వారా ముందే నిర్ణయింపబడటం వలననే. కనుక దీనికి పరిష్కారం తలరాతను చెరిపే విద్యను నేర్చుకోవడమే.

పైన చెప్పిన దాని ప్రకారం ఫలాన్ని ఆశించి కర్మలు చేస్తే జన్మ పరంపర అనేది ఎల్లప్పుడు కొనసాగుతూనే ఉంటుంది. మరి ఈ జన్మ ఆఖరి జన్మ కావాలంటే ఏం చేయాలి? తలరాత ప్రకారం జరిగే ప్రారబ్ధ కర్మలను ఇష్టంగా అనుభవించాలి. మార్గదర్శకుడు అనే టాపిక్‌లో చెప్పినట్టు జీవితంలో వస్తున్న కష్ట-సుఖాలను దైవ ప్రసాదంగా భావించి అనుభవించాలి. అలాగే భవిష్యత్తనేది సృష్టింపబడకుండా ఉండేందుకు, అంటే ఆగామి కర్మలు - సంచిత కర్మలు కాకుండా ఉండడానికి రాగ-ద్వేషాలకు అతీతంగా చేరి కర్మ చేయాలి, సంచిత కర్మలను జ్ఞానాగ్నిలో దగ్ధం చేయాలి. అంటే గతాన్ని దగ్ధం చేయాలి మరియు భవిష్యత్తును సృష్టించకూడదు, అప్పుడే ఎల్లప్పుడూ వర్తమానంలో ఉండే దైవంతో మన కలయిక సంభవమౌతుంది.

ఇవన్ని జరగాలంటే మీ జీవిత లక్ష్యం మారాలి. మీరు కేవలం ప్రాపంచికంగా అనుకున్నవి సాధించాలనే తపనను వదిలేయాలి. మీరు కేవలం ప్రాపంచిక మాయలో ఇరుక్కుని ఉంటే

మీరనుకున్నవి చచ్చినా జరగవు. అనుకున్నవి కొన్ని జరిగినా అవి తలరాతలో ఉన్నాయి కనుకే సంభవించాయని, తలరాతలో లేనివి చచ్చినా జరగవనే విషయాన్ని గ్రహించండి.

మీరు కోరినది ప్రాపంచికమైనదైతే అది జరుగుతుందని గ్యారంటీ లేదు. కర్మ, తలరాతను బట్టే జరిగి తీరుతుంది. కనుక కేవలం ప్రాపంచిక జీవితం అనేది అసంతృప్తితోనూ మరియు దుఃఖ భరితంగానూ ఉంటుంది. కాని మీరు ఎంత పాపాత్ములైనప్పటికీ మీరు కోరినది ఆధ్యాత్మికమైనదైతే అంటే పరమాత్మకు సంబంధించినదైతే తప్పక నెరవేరుతుంది. అందువలన మనిషి దైవీకంగా ఏదైనా ఎంతయినా కోరవచ్చు.

ఆత్మల్ని పుట్టించింది పరమాత్మ. జీవాత్మలను పుట్టించింది ఆత్మలు. కనుక మాయ ప్రభావంలో ఇరుక్కున్న జీవాత్మలైన మీరు, తండ్రి వద్దకు తాత వద్దకు ఏ స్థితిలోనైనా చేరవచ్చు. ఇది మీ జన్మహక్కు. మీరు నీచమైన పాపకార్యాలు చేసినప్పటికీ ఈ హక్కును ఎవ్వరు అడ్డుకోలేరని గ్రహించండి. వీరి వద్దకు చేరడానికి తలరాతతో సహా ఏదీ అడ్డు రాదు. కనుక మీరు ఆత్మజ్ఞానం పొందాలి, దేవుని సన్నిధికి చేరాలని కోరండి.

కాని దేవుడి వద్దకు చేరాలంటే ఆయనకు సంబంధించిన జ్ఞానం తెలియాలి. ఆయన గుణాల గురించి

మనకు తెలియాలి. ఆయన రాగ-ద్వేషాలకు, త్రిగుణాలకు, పాప-పుణ్యాలకు అతీతుడు. ఆయన లోపల బయట అంతటా వ్యాపించి ఉంటాడు. కనుక మీరు రాగ-ద్వేషాలకు, పాప-పుణ్యాలకు అతీతంగా చేరే ప్రయత్నం చేయాలి. దైవీక గుణాలను పెంపొందించుకోవాలి. అప్పుడే మీకు వారితో కలయిక సంభవమౌతుంది. దైవ జ్ఞానము తెలుసుకోవడమనేది మీ జన్మహక్కు, కనుక దీనిని మీరు తప్పక వినియోగించుకోండి. ఎందుకంటే అప్పుడే మీ కోరికలు తీరే అవకాశం ఉన్నది కనుక.

దేవుడు తన మీద అధికారము మనుషులకు వదిలేసి, మనుషుల మీద ఈ ప్రపంచం మీద అధికారాన్ని చేపట్టాడు. అంటే దేవుడికి మనుషుల మీద అధికారము, మనుషులకు దేవుడి మీద అధికారము ఉన్నదన్నమాట. ప్రపంచం మీద ఏ మనిషికి హక్కు లేదు. దాని మీద హక్కు కేవలం దైవానికే ఉన్నది. మనిషి కేవలం దైవం వద్దకు చేరడానికి మాత్రమే ప్రకృతి రూపాలను అంటే ప్రపంచాన్ని ఉపయోగించుకోవచ్చు. కనుక మీకు ఉన్న హక్కు మీద దృష్టిని నిలపండి. మీకున్న జన్మహక్కును వదిలేసి లేని హక్కు కొరకు ప్రాకులాడకండి.

కనుక మీరు పెట్టవలసిన సంకల్పం ఆత్మ స్థితికి చేరడం, ఆత్మ జ్ఞానాన్ని పొందడం, పరమాత్మలో ఐక్యమవ్వడం, ఈ జ్ఞానాన్ని ఇతరులకు పంచడం. ఈ

సంకల్పం అనేది ఆధ్యాత్మికమైనది, ఇది మీ జన్మహక్కు, ఇది ప్రపంచ సంబంధమైనది కాదు. అందుకే ఇది తప్పక నెరవేరుతుంది. ఇలా సంకల్పించి దానికి తగ్గట్టు మీరు ప్రయత్నిస్తే, మీ ప్రాపంచికమైన కోరికలు వాటంతటవే నెరవేరుతాయి. ఎందుకంటే మీరు దైవం వైపు పయనిస్తున్నారు కనుక. అప్పుడు దైవం మీకు అవసరమైనవన్ని సమకూర్చే బాధ్యత వహిస్తాడు. ఇలా చేస్తే కర్మ తలరాత ప్రకారం కాకుండా కొత్తగా మీ జీవితం కొనసాగుతుంది. అంతవరకు లభించని సమస్యలన్నింటికీ పరిష్కారాలు లభిస్తాయి.

**జ్ఞానాగ్ని**

మనకి కర్తృత్వమే కాక భోక్తృత్వం కూడా ఉన్నది. అంటే కర్తగా ఉంటూ కర్మలు చేస్తూ ఉంటాం, అలాగే భోక్తగా కూడా ఉంటూ చేసిన కర్మలకు లభించే ఫలితాన్ని అనుభవిస్తూ ఉంటాం. కర్మఫలితాన్ని తప్పించుకోలేం, కాని మనకి కర్తృత్వమనే రెండవ భాగం కూడా ఉన్నది. కనుక ఒకవైపు కర్మఫలాన్ని అనుభవిస్తూనే మరోవైపు కొత్త కర్మలు చేస్తాం. ఈ చేసే కర్మలలో మాత్రం మనకి కావలసినంత స్వేచ్ఛ ఉన్నది. కొత్త కర్మలు చేయడంలో తలరాత లేదా గతం మీపై పూర్తిగా ప్రభావం చూపించలేవు. అవి మళ్ళీ అదే పాత పద్ధతిని కొనసాగించమని లేకుంటే అనర్థం జరుగుతుందని

భయపెట్టవచ్చు, కాని మనకి దానిని అధిగమించి కొత్త ప్రయత్నం చేసే అవకాశం ఉన్నది.

ఎలాగైతే కంప్యూటర్ కనుక్కున్న తర్వాత, టైప్ రైటర్‌ను దానికి సంబంధించిన జ్ఞానాన్ని మరిచిపోయామో, అదే విధంగా ప్రతీ సమస్యకు సరికొత్త పరిష్కారాన్ని కనుగొనాలి. అప్పుడే దానికి సంబంధించిన పాత జ్ఞానం, అలాగే దానికి సంబంధించిన గత కర్మలు దగ్ధమౌతాయి. అంటే పాత జ్ఞానాన్ని ఉపయోగించుకోవటం మానేస్తేనే ఇది జరుగుతుంది.

అందువలన మీకు కష్టం వచ్చిన వెంటనే, దానికి బాధ్యత వహించి, ఇతరులను నిందించడం మానేసి, తలరాతలో ఉన్నది కనుకే అలా జరిగిందని భావించి, ఆ కష్టాన్ని ఉపయోగించుకుని ఆత్మ స్థితికి చేరి, ఆ కష్టానికి సంబంధించిన కొత్త పరిష్కారాన్ని ఆత్మ వద్ద పొంది, ఆత్మ సూచించిన జ్ఞానాన్ని ఆచరించి, దాని ద్వారా ఆనంద స్థితికి చేరి, ఆ కష్టానికి సంబంధించిన లక్షణాలన్నీ దివ్యమైనవేననే భావన మీలో మేల్కొన్న తర్వాతే, జ్ఞానాగ్ని అనేది పుట్టి, దానిలో ఆ కష్టానికి సంబంధించిన కర్మలన్నీ దగ్ధమౌతాయి. ఆ తర్వాతే దానికి సంబంధించిన ఫలితం లభిస్తుంది. అంటే తలరాతలో మరియు సంచిత కర్మలో దానికి సంబంధించి ఉన్న కర్మలు దగ్ధం అయినప్పుడే మీకు ఫలితం లభిస్తుంది. అంటే దేనిసైనా

సంకల్పించినప్పుడు, ముందు దానికి సంబంధించి గతంలో ఉన్న అడ్డులను తొలగించుకున్నప్పుడే ఆ సమస్యకు పరిష్కారం లభిస్తుందని గ్రహించండి.

ఉదాహరణకు మీకు శరీరంలో నొప్పి కలిగింది. అప్పుడు మీరు ఆ నొప్పిని నన్ను దైవం వద్దకు తీసుకెళ్ళమని సూచించి దానిని ఇష్టంగా అనుభవించి దైవం వద్దకు చేరి, ఇది ఎప్పుడు సహాయం చేస్తుంది, ఇది ఎప్పుడు ఇబ్బంది పెడుతుంది, ఇది ఎలా దివ్యమైన శక్తి, దీనిని దివ్యమైన శక్తిగా చూడగలగాలంటే ఏం చేయాలని మీ ఆత్మను అడిగి తెలుసుకుని, దానిని మీరు ఆచరించి, అనుభవపూర్వకంగా దానిని దివ్యమైన శక్తిగా అనుభూతి చెందాలి. మార్గదర్శకుడు టాపిక్‌లో చెప్పినట్టు ఆ నొప్పిని పరమానందంగా పరివర్తన చేయగలగాలి. సాక్షి టాపిక్‌లో చెప్పినట్టు ఆ నొప్పి ద్వారా సాక్షి స్థితి మేల్కొనాలి.

అప్పుడు మీకు అనుభవపూర్వకంగా తెలుస్తుంది సమస్య నొప్పిలో లేదని, తనలోనే ఉందని, నొప్పిలో సహాయం చేసే గుణాన్ని తను గతంలో చూడలేక దానిని ద్వేషించడంలోనే సమస్య ఉందని. ఇలా మీరు తెలుసుకున్నప్పుడే, నొప్పికి సంబంధించి మీరు గతంలో చేసిన కర్మలన్నీ ఈ జ్ఞానం ద్వారా ఉద్భవించిన అగ్నిలో దగ్ధం అవుతాయి. ఆ తర్వాతే ఆ నొప్పికి కావలసిన పరిష్కారం లభిస్తుంది,

లేకుంటే ఆ ఇబ్బంది అనేది కొనసాగుతూనే ఉంటుంది.

అలాగే సుఖం వచ్చినప్పుడు కూడా ఇదే విధంగా చేయండి. ఎందుకంటే మీరు సుఖాలకు విజయాలకు బానిసై పోయారు, అలాగే సుఖంలో దైవాన్ని మరిచే అలవాటు మీకున్నది. మంచిలో సహాయం చేసే గుణము మరియు ఇబ్బంది పెట్టే గుణము రెండూ ఉన్నాయని గ్రహించండి. అలాగే మంచి చేస్తే పుణ్యం వస్తుందని, అలాగే ఈ పుణ్యం ద్వారా పాపాలు దగ్ధమౌతాయనే భ్రమలో ఉండి చాలా మంది పుణ్యానికి బానిసైపోయారు. కాని మీరెంత పుణ్యం చేసిన గతంలో చేసిన పాప ఫలితమనేది తప్పకుండా మీ వద్దకు వస్తుంది. అలాగే పుణ్యం చేస్తే దానికి తగ్గట్టు పాపం కూడా తప్పక చేయవలసిన పరిస్థితి నెలకొంటుంది. ఈ ప్రపంచంలో కేవలం పుణ్యం మాత్రమే చేయడం అనేది అసాధ్యం. ఒక వేళ సాధ్యమైనా ఆ పుణ్యాన్ని అనుభవించడానికి మరొక జన్మ ఎత్తవలసిందే. ఎందుకంటే మీ ప్రస్తుత జన్మ అనేది తలరాత ద్వారా ముందుగానే నిర్ణయింపబడింది. కనుక దీనికి పరిష్కారం పుణ్య-పాపాల ద్వారా దైవం వద్దకు చేరి, పుణ్య-పాపాల రెండింటిని దగ్ధం చేయడం.

ఇలా మీరు మూడు గుణాలను మరియు దానికి సంబంధించిన అన్ని లక్షణాలను దివ్యంగా చూడగలిగినప్పుడే, వాటిని దైవం యొక్క ప్రతిబింబాలుగా

చూడగలిగినప్పుడే, వాటి ద్వారా దివ్యానుభూతిని పొందినప్పుడే, అన్నింటిలో దైవం మరియు దైవశక్తి దాగి వున్నదని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నప్పుడే, మీరు కర్మ సిద్ధాంతం నుంచి బయటకు వచ్చి ముక్తిని సాధిస్తారు. లేకుంటే కర్మ చక్రంలోనే ఇరుక్కుపోతారు. కనుక మీరు ప్రారబ్ధ, ఆగామి, సంచిత కర్మలను ఎలా అధిగమించాలనే విషయాన్ని తెలుసుకోవడానికి తపన పడండి. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం అని అన్నారు, కనుక మీరు ఎంత శ్రద్ధ చూపితే అంత ఆత్మ జ్ఞానం మీకు లభిస్తుంది. దానిని ఆచరించినప్పుడే మీరనుకున్నది సాధిస్తారు, లేకుంటే మీరు బాధితుడిగానే కొనసాగుతారని గ్రహించండి.